# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం, 3, జనవరి, 2025







**జీసీసీ హమాలీల సమ్మె**

గత అక్టోబర్‌లో జరిగిన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లు అమలు కోరుతూ జీసీసీ కార్మికులు సమ్మెకు దిగారు. 9లో



**డిజైన్ లోపంతోనే పగుళ్లు!**

డిజైన్ లోపంతోనే సత్తుపల్లి సింగరేణి బంకర్‌కు పగుళ్లు ఏర్పడినట్లు విచారణలో తేలిందని సమాచారం. 10లో


**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 30° / 15°

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**పాల్వంచరూరల్:** పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

### ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్

**కొత్తగూడెంరూరల్ :** జిల్లాలో పది రోజుల పాటు ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ప్రచార మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్ నాయక్ కలెక్టరేట్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పది రోజులపాటు అవగాహన కల్పించడతోపాటు ఎయిడ్స్ పరీక్షలు చేస్తారని తెలిపారు.

### ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దు

సీసీఎఫ్ భీమా నాయక్

**చుంచుపల్లి:** అడవుల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న అటవీ శాఖ సిబ్బంది ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దని సీసీఎఫ్ భీమా నాయక్ అన్నారు. గురువారం కొత్తగూడెం డివిజన్ ఫారెస్ట్ కార్యాలయంలో సింగరేణి సంస్థ సహకారంతో అటవీ శాఖ సిబ్బందికి మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ సిబ్బంది శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మూడు, ఆరు నెలలకోసారి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సింగరేణి సీఎంఓ సుజాత మాట్లాడుతూ సమాజసేవ కార్యక్రమాల్లో సింగరేణి సంస్థ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు ఫిజికల్ ఫిట్నెస్‌ను పాటించాలని సూచించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు, అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సింగరేణి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మే వరకు సింగరేణిలో బదిలీలు రద్దు

**సింగరేణి(కొత్తగూడెం):** 2024–25 ఆర్థిక సంవత్సరంలో జనవరి 1 నుంచి మే 31వ తేదీ వరకు సింగరేణిలో బదిలీలు, డిప్యూటేషన్లను రద్దు చేసినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 72 మిలియన్ టన్నులుగా సంస్థ నిర్దేశించుకుంది. గత డిసెంబర్ 29 వరకు 46.30 మిలియన్ టన్నులు మాత్రమే వెలికితీసింది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలి ఉన్న మూడు నెలల్లో ఇంకా 25.70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీలు, మ్యూచ్‌వల్ బదిలీలు, డిప్యూటేషన్లను రద్దు చేసినట్లు యాజమాన్యం తెలిపింది. కాగా సింగరేణిలో ప్రొడక్షన్ మంత్స్ మూడు మాసాలైతే ఐదు నెలలవరకు బదిలీలు నిలిపివేయటం సరికాదని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. లోప భూయిష్టమైన తాజా సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు.

### నేడు మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

**కొత్తగూడెంఅర్బన్:** సావిత్రీ బాయి పూలే జయంతి(మహిళా ఉపాధ్యాయ దినోత్సవం)ని పురస్కరించుకుని ఈ ఏడాది ఉద్యోగ విరమణ చేయనున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల నుంచి డిసెంబర్ వరకు ఉద్యోగ విరమణ పొందనున్న మహిళా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం శుక్రవారం కొత్తగూడెంలోని ఆనంద ఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరపనున్నట్లు పేర్కొన్నారు.

# మిషన్ మునగ షురూ..

**తొలిదశలో పది వేల ఎకరాల సాగు లక్ష్యం**

- 1,750 ఎకరాల్లో వేసేందుకు సిద్ధమైన రైతులు
- మొదలైన మునగ మొక్కలు నాటే కార్యక్రమం
- ఈ సీజన్ ఫలితాలపైనే మిషన్ మునగ భవిష్యత్



టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పాతతండాలో మునగ రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్(ఫైల్)

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** సంప్రదాయేతర పద్ధతుల్లో రైతులకు అధిక ఆదాయం తీసుకురావాలనే లక్ష్యంతో మునగ సాగును ప్రోత్సహించేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నడుం బిగించారు. గత నవంబర్‌లో మిషన్ మునగను మొదలు పెట్టారు. ఈ రబీ సీజన్‌లో పది వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా ఒక్కో అడుగు ముందుకు పడుతోంది.

**రెండు వేలలోపే..**

కొన్నేళ్లుగా పత్తి సాగుకే అలవాటు పడిన రైతులు కొత్తగా మునగ సాగుకు మొగ్గు చూపేందుకు కొంత సంశయించారు. దీంతో ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 1,464 మంది రైతులు 1,750 ఎకరాల్లో మునగ సాగు కోసం ఇటు వ్యవసాయ అటు ఉపాధిహామీ శాఖలకు తమ సంసిద్ధతను తెలియజేశారు. ఇందులో ఇప్పటికే 196 మంది రైతులు 222 ఎకరాల్లో మొక్కలను నాటారు. చిన్న, సన్నకారు రైతులే మునగ సాగుకు ఎక్కువ ఆసక్తి చూపించారు. ఉపాధి హామీ పథకాన్ని జోడించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశముందంటున్నారు.

**సానుకూలమే**

తమిళనాడులోని సేలం జిల్లాలో దేశంలోనే అత్యంగా మునగను సాగు చేస్తున్నారని, అక్కడ ఇప్పుడు 30 వేల ఎకరాల్లో మునగ సాగు ఉందంటున్నారు. మన దగ్గర తొలి ఏడాదే 1,750 ఎకరాల్లో మునగ సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపించడం చిన్న విషయమేమీ కాదని జిల్లా అధికారులు చెబుతున్నారు. మిషన్ మునగ నవంబర్ రెండో వారంలో మొదలైంది. ముందుగా ఈ సాగుపై ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఉపాధిహామీ పథకంలో తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఎకరానికి ఒక కిలో వంతున గింజలను కొనుగోలు చేసి తమ ఇంటి ప్రాంగణంలోనే వాటిని నానబెట్టి మొలకెత్తించారు. డిసెంబర్ మూడో వారం సమయానికి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా పత్తి తీతలు పూర్తయ్యాయి. దీంతో ఆసక్తి ఉన్న రైతులు తమ పొలాల్లో మునగ నాటడం ప్రారంభించారు.

**ఆసక్తి పెంచేలా..**

మునగ సాగు చేస్తున్న పొలాలకు పశువుల నుంచి రక్షణ కల్పించేందుకు వెదురు, బ్రష్‌వుడ్‌లను ఉచితంగా సరఫరా చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ప్రస్తుతం మునగ సాగు చేస్తున్న రైతులు వెదురు సాగుకు ఆసక్తి చూపించడం లేదు. మరోవైపు మునగ సాగు విషయంలో రైతుల్లో మరింత అవగాహన కల్పించేందుకు వీలుగా గ్రామ పంచాయతీల స్థాయిలో స్కూళ్లు, పార్కులు, ఇంటింటికి మునగ మొక్కలు ఉచితంగా అందివ్వాలని జిల్లా అధికారులు నిర్ణయించారు.

**మలి దశలో..**

తొలి ఏడాది మునగ సాగులో మంచి లాభాలను రైతులకు అందివ్వగలిగితే రాబోయే సీజన్‌లో మునగకు రైతుల నుంచి మద్దతు పెరుగుతుందంటున్నారు. అప్పుడు సంప్రదాయేతర వ్యవసాయంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు చేపట్టేందుకు ఆస్కారం కలుగుతుంది. మలిదశకు సంబంధించి రెండెకరాల పొలంలో మునగ, వెదురుల సాగుతో పాటు చేపలు, తేనెటీగల పెంపకానికి చోటు కల్పిస్తూ ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు.

**అధిక ఆదాయం..**

జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. సంప్రదాయ పంటల సాగు వల్ల ఎకరానికి రూ.20 వేలకు మించి ఆదాయం రావడం లేదు. తాము చెప్పిన పద్ధతిలో మునగ సాగు చేస్తే ఎకరానికి కనిష్టంగా రూ.75 వేల ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. గింజలు, ఆకుల అమ్మకం ద్వారా మరో రూ. 25 వేల వరకు ఆదాయం సమకూరుతుందంటున్నారు. ఇప్పటికే జిల్లాలో చేపట్టిన మిషన్ మునగ గురించి తెలుసుకుని ఎండిన మునగ ఆకులు కొనుగోలు కోసం తమిళనాడు నుంచి వ్యాపారులు వాకబు చేస్తున్నారు. దీంతో లీఫ్ డ్రైయర్ మిషన్ల కొనుగోలు, నిర్వహణపై జిల్లా అధికారులు దృష్టి సారించారు.

# వరాహావతారంలో భద్రాద్రి రామయ్య

**దేవస్థానంలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు**



శ్రీసీతారామ చంద్రస్వామివారు

**భద్రాచలం:** లోకకంటకుడైన హిరణ్యాక్షుడిని సంహరించి భూమిని తన కోరలతో పైకెత్తి లోకసంరక్షణ చేపట్టిన వరాహావతారంలో రామయ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. పగటి పూట జరిగే పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని వరాహావతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామునే ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన, ఆరగింపు ఇచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపం వద్దకు తీసుకొచ్చి పూజలు జరిపారు. ఆ తర్వాత వేద పండితులు దివ్య ప్రబంధాలు చదివారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలో వరాహావతారంలో అలంకరింపజేశారు. గర్భగుడి నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి ఆళ్వార్లతో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు అనంతరం పల్లకీపై ఊరేగింపుగా మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీలు, భక్తుల కోలాహలం నడుమ మిథిలా స్టేడియ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి హారతిని ఇవ్వగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం కోలాటాల నడుమ భక్తుల రామనామస్మరణలతో తిరువీధి సేవ సాగింది. తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజస్వామి ఆలయం వరకు స్వామివారిని తీసుకెళ్లి, అక్కడ నుంచి ఊరేగింపుగా తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నేడు నరసింహావతారంలో దర్శనం**

తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని అనేక బాధలకు గురిచేస్తున్న హిరణ్యకశిపుడు అనే రాక్షసుడిని సంహరించేందుకు నారాయణుడు నరసింహావతారాన్ని ధరించాడు. ఈ అవతార నిడివి స్వల్పకాల్వమైనా భగవానుని సర్వవ్యాపకతను తెలియజేస్తుంది. భూత గ్రహ, కుజ గ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని పూజించటం వల్ల విముక్తి పొందుతారని శాస్త్రం చెబుతోంది.

**అలరించిన నృత్య ప్రదర్శనలు**

**భద్రాచలంఅర్బన్:** వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం నాట్య భారతి సంగీత నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీ, లాస్య ప్రియ శిష్య బృందం నాట్య ప్రదర్శనలు నిర్వహించింది. ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

# విద్యార్థుల్లో స్కిల్స్ పెంపొందించాలి

- సెల్ఫీ పాయింట్ ఆకర్షణీయంగా ఉండాలి
- ఐటీడీఏ పీఓ రాహుల్



మ్యూజియం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

**భద్రాచలం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో కంప్యూటర్ స్కిల్స్‌ను కూడా పెంపొందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. గురువారం ఐటీడీఏలోని పీఎంఆర్‌సీ భవన సమావేశ మందిరంలో ఏటీడీఓలకు, పీజీ హెచ్‌ఎంలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మూడో తరగతి నుంచే కంప్యూటర్ పాఠ్యాంశాలను సిలబస్‌లో చేర్చాలన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. గిరిజన మ్యూజియానికి వచ్చే పర్యాటకులు, భక్తులను ఆకట్టుకునేలా సెల్ఫీ పాయింట్, లైటింగ్ ఉండాలని, ఫెన్సింగ్ మల్టీకలర్‌లో ఉండాలని చెప్పారు. స్వాగత ద్వారం వరకు విద్యుత్ దీపాలను అలంకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు మణెమ్మ, విజయలక్ష్మి, డేవిడ్ రాజ్, రమణయ్య, రాములు, అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, జహీరుద్దీన్, సత్యవతి, నారాయణరెడ్డి, ఉదయ్ కుమార్, హరికృష్ణ, మునీర్ పాషా, హరీష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ముక్కోటి ఉత్సవాలకు ఆహ్వానం**

ఈ నెల 9,10వ తేదీల్లో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు రావాలని ఆలయ ఈఈ రవీందర్ ఆహ్వాన పత్రికను పీఓ రాహుల్‌కు అందచేశారు. పండితులు శాలువాతో సత్కరించి వేదాశీర్వచనం చేసి ప్రసాదాలను అందచేశారు. కాగా తెప్పోత్సవం జరిగే గోదావరి తీరం వద్ద సైతం ఆదివాసీ చిత్రాలతో, విద్యుత్ దీపాలతో సెల్ఫీ పాయింట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

## డీఆర్‌సీసీ పరిశీలన

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని మనుబోతుల చెరువు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన డీఆర్‌సీసీలో ఉన్న యంత్రాలను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గురువారం సందర్శించారు. సుమారు రూ.80 లక్షల వ్యయంతో డీఆర్‌సీసీ (డ్రై వేస్ట్ రిసోర్స్ కలెక్టింగ్ సెంటర్)తో నిర్మించారు. రూ.53 లక్షలతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. మరో రూ.60 లక్షలు వెచ్చించి నాలుగుమిషన్లు తెప్పించి అమర్చారు. సెంటర్‌లో అమర్చిన మిషన్లను అధికారులు పరిశీలించి, పనితీరుపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా డీఆర్‌సీసీలో ఏర్పాటు చేసిన తడిచెత్తతో బ్రిక్స్ తయారీ యూనిట్ సాంకేతిక కారణాలతో ఇంకా వినియోగంలోకి రాలేదు. డీఎల్పీఓలు సుధీర్, రమణారావు, గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ బేబీస్



భద్రాచలం ప్రభుత్వాస్పత్రి ఎస్‌ఎన్‌సీయూలో శిశువులు

**భద్రాచలంఅర్బన్:** నూతన సంవత్సర ప్రారంభం రోజు బుధవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రి, మరో ప్రైవేటు ఆస్పత్రిలో 10 మంది శిశువులు జన్మించారు. భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, అశ్వాపురం, ఏపీలోని అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన ఏడుగురు మహిళలు ప్రభుత్వాస్పత్రిలో కాన్పు పొందారు. పట్టణంలోని జీవన్ ప్రైవేట్ ఆస్పత్రిలో కుక్కునూరు(ఏపీ)కు చెందిన నాగలక్ష్మి కవల ఆడ పిల్లలకు జన్మనిచ్చింది. అదే ఆస్పత్రిలో మరో మహిళ కూడా బిడ్డకు జన్మనిచ్చింది. నూతన సంవత్సరం సందర్భంగా భద్రాచలంలో 10 మంది శిశువులు జన్మించగా, వీరిలో ఐదుగురు మగమహారాజులు, ఐదుగురు కనక మహాలక్ష్మిలు ఉన్నారు. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు గురువారం వివరాలు వెల్లడించాయి.

# పర్యాటకులను బంధువులుగా పరిగణించాలి

**దుమ్ముగూడెం :** గ్రామానికి వచ్చే పర్యాటకులను బంధువులుగా పరిగణించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. గురువారం మండలంలోని పాత నారాయణపేట గ్రామంలో పర్యాటకుల కోసం సిద్ధం చేస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. ఆర్చరీ క్రీడా స్థలం, మొక్కజొన్న, ఇతర పంటలను సందర్శించారు. అనంతరం బొజ్జు గుప్ప లోని చెరువులో బోటుషికారు చేశారు. సరదాగా మేక పిల్లను ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అతిథులను గిరిజన సంప్రదాయ ప్రకారం ఆహ్వానించాలని, ఆచార వ్యవహారాలు వారికి తెలపాలని అన్నారు. మంచెలు, ఆర్చరీ, స్వాగత ద్వారాల నిర్మాణం ఈ నెల 5వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహారావు, జేడీఎం హరికృష్ణ, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరాస్వామి, ఐకేపీ ఏపీఎం హేమంతిని, ఏపీఓ సుకన్య, కిషోర్, నాగేశ్వరరావు సెక్రెటరీ స్రవంతి పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

**ఎస్పీ రోహిత్‌రాజు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

**కొత్తగూడెంటౌన్:** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం అందరి బాధ్యత అని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక, విద్య, ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఐదు సబ్ డివిజన్లలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఈ నెల 31వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. తప్పిపోయిన పిల్లలను, కిరాణాషాపులు, మెకానిక్ షాపులు, హోటల్స్, ఫ్యాక్టరీలలో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించాలన్నారు. భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించాలని సూచించారు. లేకపోతే చైల్డ్ కేర్ హోమ్‌కు పంపించాలని చెప్పారు. పిల్లలతో బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులు కనిపిస్తే 1098/100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆపరేషన్స్ స్మైల్ పోలీస్ నోడల్ ఆఫీసర్ డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి గౌడ్, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, సీడబ్ల్యూసీ సభ్యులు అంబేద్కర్, సాధిక్‌పాషా, కార్మిక శాఖ అధికారులు షర్ఫుద్దీన్, నాగరాజు, ఏసుపాదం, డీసీపీఓ హరికుమారి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, షీటీం ఎస్సై పి.రమాదేవి పాల్గొన్నారు.

# 'ఏడు'పిస్తున్నారు..!

- ఏడేళ్లుగా పెండింగ్‌లో హమాలీ చార్జీలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులపైనే భారం
- జిల్లాలో కర్షకులకు రూ.5.26 కోట్ల బకాయి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీ కార్మికులు(ఫైల్)

**పాల్వంచరూరల్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు హమాలీ చార్జీలు భారంగా మారాయి. ఏడేళ్లుగా ప్రభుత్వం చార్జీలు చెల్లించకపోవడంతో కర్షకులే భరించాల్సివస్తోంది. ఒక్కో క్వింటాల్‌కు రూ.5.10 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. తొలుత రైతులు హమాలీ చార్జీలు చెల్లిస్తే, ప్రభుత్వం మంజూరు చేశాక రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో భారమైనా తప్పక రైతులు భరిస్తున్నారు. జిల్లాలో ఏడేళ్ల నుంచి ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి సుమారు 10,52,960.449 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, రూ.5,26,48,000 హమాలీ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. రైతులు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం కనికరించడంలేదు. అధికారులు మాత్రం కేంద్ర ప్రభుత్వం నుంచి హమాలీ చార్జీలు ఇంకా రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5.10 చెల్లిస్తుండగా, ధాన్యం కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు రూ.50 నుంచి రూ. 55 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. లేకపోతే హమాలీలు కాంటాకు రావడం లేదు. ఇచ్చే కొద్దిమొత్తమైనా ప్రభుత్వం చెల్లించకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా ఈఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి.

**2016 నుంచి నిలిపివేత..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడం, వాహనాల్లో లోడింగ్ చేయడానికి హమాలీలకు ముందస్తుగా రైతులు డబ్బులు చెల్లిస్తారు. రైతులపై హమాలీ భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5.10 చొప్పున విడుదల చేస్తుంది. అనంతరం కేంద్రాల నిర్వాహకులు ఆ డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. కానీ ఏడేళ్లుగా ప్రభుత్వం హమాలీ చార్జీల చెల్లింపులను నిలిపివేసింది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

**ప్రతిపాదనలు పంపాం**



ధాన్యం కొనుగోలు హమాలీ చార్జీలు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిఉంది. తాజా మార్కెట్ రేట్లతో హమాలీ చార్జీల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే చెల్లిస్తాం.

–త్రినాథ్‌బాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

**అదనపు భారం**



ప్రతీ సంవత్సరం ధాన్యం విక్రయాల్లో రైతులపై అదనపు భారం పడుతోంది. ఎప్పటికప్పుడు హమాలీ కూలి చెల్లిస్తే రైతులకు భారం తగ్గి ఉపశమనం కలుగుతుంది.

–దాసరి రమేష్, రైతు

**విడుదల చేయాలి**



హమాలీ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి. గతంలో ఎప్పటికప్పుడు చెల్లించారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం చెల్లించకపోవడంతో మాపై భారం పడుతోంది.

–నాగిరెడ్డి, రైతు

**రూ.50 ఇస్తున్నాం**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.50 చొప్పున చెల్లిస్తున్నాం. ప్రభుత్వం రూ.5.10 మాత్రమే చెల్లిస్తుంది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచి చెల్లించాలి.

–వెంకట్‌రెడ్డి, రైతు

**ఏడేళ్లుగా ధాన్యం సేకరణ, పెండింగ్‌లో ఉన్న హమాలీ చార్జీల వివరాలు**

| ఏడాది | ఖరీఫ్ | | రబీ | |
|---|---|---|---|---|
| | ధాన్యం సేకరణ (మెట్రిక్ టన్నుల్లో) | హమాలీ చార్జీలు (రూ. లక్షల్లో) | ధాన్యం సేకరణ (మెట్రిక్ టన్నుల్లో) | హమాలీ చార్జీలు (రూ. లక్షల్లో) |
| 2017-18 | 81,942 | 40.97 | 22,810 | 11.40 |
| 2018-19 | 1,70,554 | 85.27 | 35,662 | 7.83 |
| 2019-20 | 1,29,899 | 64.94 | 60,408 | 30.20 |
| 2020-21 | 1,45,329 | 72.66 | 72,124 | 36.06 |
| 2021-22 | 1,04,351 | 52.17 | 21,644 | 10.82 |
| 2022-23 | 1,16,991 | 58.49 | 37,123 | 18.56 |
| 2023-24 | 64,276 | 3.27 | 43,000 | 2.19 |

# ‘సహకార’ విభజనకు కసరత్తు..!

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు**

- పెద్ద సంఘాల విభజనలో యంత్రాంగం
- ఖమ్మం జిల్లాలో 20, భద్రాద్రి జిల్లాలో 21 సంఘాలు..
- నూతనంగా 60 సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు
- నేడు రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌కు ప్రతిపాదనలు
- అధికారుల సమావేశంలో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ఖమ్మం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ఖమ్మంవ్యవసాయం:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెద్ద సహకార సంఘాల విభజనకు సంబంధించిన ప్రతిపాదనలను శుక్రవారం సాయంత్రానికి రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్‌కు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గురువారం సాయంత్రం జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశాలను నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 100 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా.. ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 21, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 4 ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 20, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 21, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 4 సహకార సంఘాలను పెద్ద సహకార సంఘాలుగా గుర్తించారు. ఒక్కో పెద్ద సంఘాలను మరో రెండు రెండు లేదా మూడుగా విభజించేలా కసరత్తు జరుగుతోంది. ఈ అంశంపై ఖమ్మంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించగా.. జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మోహనమురళి, జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి డాక్టర్ కే.వీ.నారాయణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ వెంకట ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

**నూతన సంఘాలకు ప్రతిపాదనలు**

- ఖమ్మం జిల్లాలో 33 సంఘాలు..

ఖమ్మం జిల్లాలో 20 పెద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మరో 33 సహకార సంఘాలను వనరులు, అవసరాల ఆధారంగా క్షేత్ర స్థాయి నుంచి ప్రతిపాదనల రూపకల్పన జరుగుతోంది. సహకార సంఘాల నుంచి రుణాలు పొందడం మొదలు, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కొనుగోల్లు, ధాన్యం విక్రయాలకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం మండలంలోని వీవీ పాలెం సహకారం సంఘం నుంచి చింతగుర్తి, అల్లీపురం, మంచుకొండ సహకార సంఘం నుంచి చిమ్మపుడి ఈర్లపుడి, కామేపల్లి సహకార సంఘం నుంచి కొత్త లింగాల, కారేపల్లి నుంచి పేరేపల్లి, కోమట్లగూడెం, ఏన్కూరు మండలం గార్లొడ్డు సహకార సంఘం నుంచి బురదరాఘవపురం, నాచారం, ఖమ్మం రూరల్ మండలం నుంచి ఎంవీ పాలెం, కామంచికల్లు, చింతకాని నుంచి పొద్దుటూరు, తిరుమలాపాలెం సహకార సంఘం నుంచి పిండిప్రోలు, జల్లేపల్లి, బీరోలు సహకార సంఘం నుంచి సుబ్లేడు, కాకరవాయి, కొణిజర్ల సహకార సంఘం నుంచి సింగరాయపాలెం, పెద్దగోపతి, వైరా నుంచి గొల్లపూడి, పాలడుగు/అప్పగుర్తి, మధిర నుంచి సిరిపురం, కల్లూరు నుంచి యజ్ఞనారాయణపురం, కేజీ మల్లెల నుంచి అడ్సర్లపాడు, కారాయిగూడెం నుంచి కుప్పెనకుంట్ల, పెనుబల్లి నుంచి లంకపల్లిలను నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు.

- భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 35 సంఘాలు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఉన్న 23 మండలాల్లో మొత్తం 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పెద్దవి కావడంతో ఒక్కోదాన్ని రెండు లేదా మూడు సంఘాలుగా మొత్తం 35 నూతన సంఘాలుగా విభజించేందుకు ప్రతిపాదనలు తయారవుతున్నట్లు ఆ జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ తెలిపారు. ఇందులో గుండాల, టేకులపల్లి, ఇల్లెందు, జూలూరుపాడు, దమ్మపేట, చర్ల, గుంపెన, పాల్వంచ, సుజాతనగర్ తదితర సహకార సంఘాల నుంచి నూతన సహకార సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ జిల్లాలో డీసీఓ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.

**నేడు ప్రతిపాదనల సమర్పన**

నూతన సహకార సంఘాల ప్రతిపాదనలకు సంబంధించిన నివేదికను జిల్లా సహకార అధికారుల నుంచి రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌కు శుక్రవారం సాయంత్రం వరకు ప్రతిపాదనలు సమరించాల్సి ఉంది. ఈనేపథ్యాన రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ప్రతిపాదనలను రిజిస్ట్రార్ పరిశీలించి వనరులు, అవసరాల ఆధారంగా నూతన సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది. రానున్న ఫిబ్రవరితో ప్రాథమిక సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం ముగుస్తుండడంతో ప్రభుత్వం ఈమేరకు కసరత్తు చేస్తోంది.

## నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపీ పర్యటన

**ఖమ్మంవన్‌టౌన్:** ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈనేపథ్యాన ఉద యం 9 గంటలకు సుజాతనగర్ నాయకులగూడెం గ్రామంలో పరామర్శించనుండగా.. 9:15 గంటలకు సుజాతనగర్‌లో సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవం, 10:20 గంటలకు పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌లో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, 11 గంటలకు పాండురంగాపురంలో బీటీ రోడ్డు నిర్మాణా నికి శంకుస్థాపన, 11:45 గంటలకు లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రైఫిల్ షూటింగ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవం ఉంటుంది. అదేవిధంగా 12:15 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ 6వ బెటాలియన్ వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, మధ్యాహ్నం 1:30 గంటలకు కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియాఆస్పత్రి సమీపంలో ఇందిరా మహిళా శక్తి ఫుడ్‌కోర్టు సందర్శ న, 2గంటలకు కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి ఎదురుగడ్డ వరకు విస్తరించిన రోడ్డు ప్రారంభోత్సవం, 2:15 గంటలకు గణేష్ టెంపుల్ వద్ద కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేయనున్నారు. అంతేకాక సాయంత్రం 4 గంటలకు నూతన కలెక్టరేట్‌లో మున్నేరు కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష, 5:30 గంటలకు ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, 6 గంటలకు కాచిరాజుగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, 6:30 గంటలకు చింతపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

## క్లుప్తంగా

### విద్యార్థికి ఐటీడీఏ పీఓ ప్రోత్సాహకం


చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

**భద్రాచలంటౌన్:** నీట్ ఎంట్రన్స్ పరీక్షలో స్టేట్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన మాలోత్ సిద్ధి వినాయక్‌కు గురువారం భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ప్రోత్సహకం అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన సిద్ధి వినాయక్ నీట్‌లో ప్రతిభ కనబర్చి గుజరాత్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో మెకానిక్‌లో సీటు సంపాధించాడన్నారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం కోసం ప్రోత్సాహకంగా ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.50 వేల చెక్కును అతడి తండ్రికి అందించినట్లు పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, విద్యార్థి తండ్రి కరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### పాడె మోసిన ఎమ్మెల్యే


మల్కారంలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే జారే

**దమ్మపేట:** మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బత్తుల సుదర్శన్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆయన భౌతికకాయానికి పూలతో నివాళులర్పించి, మృతుడి దహన కార్యక్రమాల్లో పాల్గొని పాడె మోశారు. గురువారం మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా తెల్లవారుజామునే మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో హలో శుభోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పాపాయమ్మ, భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి పలు వివరాలను ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. మహమ్మద్ కబీర్ సంస్మరణ సభలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### ఓవరాల్ చాంపియన్ ‘భద్రాద్రి’

- ద్వితీయ స్థానంలో ఖమ్మం అథ్లెట్లు

**వరంగల్ స్పోర్ట్స్:** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 14 రోజుల పాటు సాగిన సీఎం కప్ క్రీడా పండుగ గురువారం సాయంత్రం ముగిసింది. ఆరు క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 4వేల మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం 33 జిల్లాల అథ్లెట్లు పోటీ పడగా 86 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. తర్వాత 62 పాయింట్లతో రెండో స్థానంలో ఖమ్మం జిల్లా అథ్లెట్లు నిలిచారు. 46 పాయింట్లతో మూడో స్థానాన్ని హైదరాబాద్ దక్కించుకుంది.

### రేపు గాయనీ, గాయకుల ఎంపిక

**ఖమ్మంగాంధీచౌక్:** సినీ గేయ రచయిత, వాగ్గేయకారుడు, ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్ రచించిన ‘నూరేళ్ల నా ఊరు’ గేయ కావ్యానికి శనివారం గాయనీ, గాయకుల ఎంపిక ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 243 చరణాలను 243 మంది గాయకులతో పాడించాలనే సంకల్పంతో ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల గాయనీ, గాయకులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతగా తానే వ్యవహరిస్తున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కళాకారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కళాకారులకు భోజన సదుపాయం ఉంటుందని కూడా పేర్కొన్నారు.

### పాఠశాలలో సోలార్ మిషన్ మాయం

**చంద్రుగొండ :** చంద్రుగొండలోని అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోలార్‌విుషన్ మాయమైంది. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రధానోపాధ్యాయుడు నకిరేకంటి వెంకటేశ్వర్లు తన సొంత డబ్బులతో సోలార్ మిషన్, ప్రహరీకి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. అయితే ఈ నెల 31న పాఠశాలకు తాళం వేశాక.. 1న సెలవు కావడంతో 2న ఉదయం పాఠశాలకు వచ్చిన చూడగా.. మిషన్ కనిపించలేదు. వేసిన తాళం వేసినట్లే ఉండగా మిషన్ మాయంకావడంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### టిప్పర్ దగ్ధం

**కొత్తగూడెంరూరల్:** లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం నుంచి కారుకొండ మీదుగా ఇల్లెందు వెళ్లే రహదారిపై గురువారం ఓ టిప్పర్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. జూలురుపాడు నుంచి పాల్వంచ వెళ్తున్న ఓ టిప్పర్ ఇంజన్‌లో సాంకేతిక సమస్య నెలకొనడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో ఎవరికి ఏమి కాలేదు.

# చాంపియన్లుగా మహబూబ్‌నగర్, ఖమ్మం


మహిళల విజేత ఖమ్మం జట్టు


రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం పురుషుల జట్టు

**ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు**

**ఖమ్మం స్పోర్ట్స్/మహబూబ్‌నగర్ క్రీడలు:** రాష్ట్ర స్థాయి సీఎం కప్ టోర్నీ నెట్‌బాల్ పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్, మహిళల విభాగంలో ఖమ్మం జట్లు చాంపియన్లుగా నిలిచాయి. మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ గురువారం ముగిసింది. పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్-ఖమ్మం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఆట ముగిసే సమయానికి మహబూబ్‌నగర్ 19-16 పాయింట్ల తేడాతో ఖమ్మంపై విజయం సాధించింది. మహిళల ఫైనల్‌లో ఖమ్మం జట్టు మహబూబ్‌నగర్‌పై 23-6 పాయింట్ల తేడాతో గెలుపొందింది. అంతకుముందు జరిగిన పురుషుల విభాగం సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 19-7 పాయింట్ల తేడాతో మేడ్చల్ జట్టుపై, ఖమ్మం జట్టు 15-13 తేడాతో నారాయణపేట జట్టుపై గెలుపొందాయి. మహిళల సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 17-11 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, ఖమ్మం జట్టు 18-12 తేడాతో మేడ్చల్ జట్టుపై విజయం సాధించాయి. జిల్లా క్రీడాకారులు జయకేతనం ఎగురవేయడం పట్ల డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులురాలు చింతనిప్పు దీప్తి, కార్యదర్శి ఎం.ఫణికుమార్, నెట్‌బాల్ కోచ్ పీ.వీ.రమణ అభినందనలు తెలిపారు.

# చైనా మాంజా విక్రయదారులపై కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

**కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు/టేకులపల్లి:** కొత్తగూడెం పట్టణ పరిధి చిన్నబజార్‌లో చైనా మాంజా విక్రయిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రెహమాన్ తెలిపారు. ఈమేరకు గురువారం వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం పట్టణంలో నిషేధిత చైనా మాంజాలు అమ్ముతున్నారనే సమాచారం మేరకు త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ఎస్సైలు పురుషోత్తం, జి.మస్తాన్‌లు వారి సిబ్బందితో కలిసి చిన్నబజార్, పెద్దబజార్ ఏరియాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీంతో పెద్దబజార్‌లో పవన్ టాయ్స్ షాపులో మాంజాదారక్-30 బండిల్స్, త్రెడ్ రోల్ 10 ప్యాకెట్లు, పవన్ జనరల్ మార్చెంట్ షాపులో మాంజా 14 బండిల్స్ పట్టుకొని సీజ్ చేసి, షాపు యజమానులు కె.పవన్, కిషోర్‌సాహులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిషేధిత చైనా మాంజాల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన మాంజాల విలువ రూ.9100 ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఇల్లెందు పట్టణంలో డీఎస్పీ చంద్రబాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యాన, టేకులపల్లిలో ఎస్సై పి.సురేష్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి ప్రాణాలను హరించే చైనా మాంజాలను అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**సుజాతనగర్:** మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారంతో సుజాతనగర్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మొత్తం 10 మందిలో ఏడుగురిని అదుపులోకి తీసుకోగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పందెం రాయుళ్లు..

**ములకలపల్లి:** మండలపరిధిలోని నల్లముడి గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఆధ్వర్యాన దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,070 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# పూలే స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలి


విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఐద్వా నాయకులు

**భద్రాచలంఅర్బన్:** సావిత్రీ బాయి పూలే స్ఫూర్తితో నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సీతాలక్ష్మి, జ్యోతి పిలుపునిచ్చారు. పూలే 194వ జయంతి సందర్భంగా గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యాన క్రాంతి విశ్వవిద్యాలయంలో ‘మహిళల విద్య-సావిత్రీ బాయి పూలే కృషి’అంశంపై విద్యార్థులకు డిబేట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే మహిళలకు విద్య అవసరమని, కుల వివక్షతకు, మూఢాచారాలు, బాల్యవివాహాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా తన భర్త జ్యోతిబాయ్ పూలేతో కలిసి పోరాడారని, ఆమె ఇచ్చిన స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధిలో మహిళల విద్య కీలకమైందన్నారు. అనంతరం డిబేట్ విజేతలకు ఐద్వా పట్టణ కమిటీ తరఫున షీల్డ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్ నాదెళ్ల లీలావతి, జిల్లా కమిటీ సభ్యులు జీవనజ్యోతి, గౌతమి, పూర్ణిమ, గడ్డం నాగలక్ష్మి, అశ్విత, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా స్వాధీనం

**జూలూరుపాడు:** మండలంలోని సాయిరాంతండా గ్రామంలో అక్రమంగా నిషేధిత నాటు సారా తయారీ చేసి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారంతో గురువారం జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి, తన పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. నాటుసారా తయారీ చేసి, విక్రయిస్తున్న తేజావత్ కిషన్ వద్ద నుంచి సుమారు నాలుగు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిషేధిత గుట్కాలు, నాటు సారా, నల్లబెల్లం కల్గిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## దాడి ఘటనపై కేసు నమోదు

**ఇల్లెందు:** డబ్బుల విషయంలో జరిగిన ఓ ఘర్షణలో ఒక వ్యక్తిపై ఆరుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారపుట్ట వీరాపురంకు చెందిన రాజేష్‌ను అదే గ్రామానికి చెందిన చందూ, వెంకన్న, రమేష్‌లతో పాటు మరో ముగ్గురు కలిసి గత నెల 30న దాడి చేశారు. ఈ సంఘటనలో రాజేష్ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.సూర్య ఆరుగురిపై కేసు నమోదు చేశారు.



# కొడుకు ప్రాణం తీసిన తండ్రి అస్థికలు

- అనారోగ్యంతో రెండు వారాల క్రితం తండ్రి మృతి
- తండ్రి అస్థికలు కలిపేందుకు వెళ్లి కొడుకు మృత్యువాత


తండ్రి గోపాలం, కుమారుడు వెంకటేశ్వరావు (ఫైల్)

**చర్ల:** తన తండ్రి అస్థికలను గోదావరిలో కలిపేందుకు వెళ్లిన కొడుకు తనువు చాలించిన విషాద సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రెండు వారాల వ్యవధిలోనే తండ్రీ కొడుకులు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన చర్లలోని గణేష్‌నగర్‌కు చెందిన ఎడ్ల గోపాలం (80) ఇటీవల అనారోగ్యంతో గత నెల 17న మృతి చెందాడు. అయితే రెండు రోజుల క్రితం దశదిన కార్యక్రమాలు పూర్తి చేయగా.. గోపాలం అస్థికలను భద్రాచలంలోని గోదావరిలో కలిపేందుకు అతడి కుమారుడు ఎడ్ల వెంకటేశ్వరావు(50) బుధవారం రాత్రి వెళ్లగా అక్కడ నడుచుకుంటూ గోదావరి వైపునకు వెళ్తూ కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు గురువారం వెంకటేశ్వరావు మృతదేహాన్ని చర్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలవాల్సిన భర్త, పెద్ద కొడుకు ఇద్దరూ రెండు వారాల వ్యవధిలోనే మృతి చెందడంతో గోపాలం భార్యతో పాటు కుమార్తెలు గుండెలవిసేలా రోధించారు. గోపాలానికి భార్య కామాక్షి, నలుగురు పిల్ల లు ఉన్నారు. కాగా, గతేడాది ఇదే కుటుంబంలో చిన్న కుమారుడు సంపత్ సైతం అనారోగ్యంతో మృతి చెందాడు.

## బాలికపై అత్యాచార యత్నం

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

**టేకులపల్లి:** బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడిపై గురువారం పోక్సో కేసు నమోదైంది. బోడు ఎస్ఐ పాడిశెట్టి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంగారం పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (13) జిల్లాలోని ఓ మండలానికి చెందిన కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తుంటారు. అయితే క్రిస్మస్ సెలవులు, సీఆర్‌టీల సమ్మె కారణంగా బాలికను వారం రోజుల క్రితమే తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన సంపత్‌నగర్‌కు చెందిన యువకుడు ఎం.శివ (29) ఇంట్లోకి వెళ్లి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి దేహశుద్ధి చేశారు. దీంతో యువకుడు పరారయ్యాడు. రాత్రి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

## మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

- ఆటోలో తీసుకెళ్లి దారుణానికి పాల్పడిన బాబాయ్
- పోక్సో కేసు నమోదు

**అశ్వారావుపేటరూరల్:** అభంశుభం తెలియని ఓ చిన్నారిపై, వరుసకు బాబాయ్ అయిన మైనర్ బాలుడు లైంగికదాడికి పాల్పడిన ఈ దారుణ ఘటన బుధవారం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు(17) అదే గ్రామానికి చెందిన మూడేళ్ల వయసున్న చిన్నారిని ఆటోలో తీసుకెళ్తానని చెప్పి, గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అనంతరం చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన చిన్నారిని తల్లి గమనించి గురువారం పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై స్థానిక ఎస్సై టి.యయాతిరాజు విచారణ చేసి బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి, చిన్నారికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సంపత్

**పాల్వంచరూరల్:** పదిమందిలో కొట్టి బెదిరించడాని మనస్థాపానికి గురైన ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బంద్రుగొండ గ్రామానికి చెందిన కంటి సంపత్ బుధవారం గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గం మధ్యలో ఉన్న పాకల వెంకట్రావ్ మరికొంత మందితో మాట్లాడుతుండగా.. గొర్రెలు ఎలా వెళ్లాలని సంపత్ అడుగగా.. పక్కనుంచి తోలుకెళ్లు అని చెప్పడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో పాటు వెంకట్రావ్ అందరి ముందు సంపత్ కొట్టాడని చెప్పారు. అంతేకాక ఇంటికొచ్చి కూడా బెదిరించడని, మనస్థాపంతో సంపత్ ఇంట్లో గడ్డిమందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఆస్పత్రికి, ఆపై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కంటెం భద్రయ్య ఫిర్యాదు మేరకు గురువారం వెంకట్రావ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో దొంగ మృతి


నిరంజన్ (ఫైల్)

**కొత్తగూడెంటౌన్:** దొంగతనానికి వెళ్లిన ఓ దొంగ విద్యుదాఘాతంలో మృతి చెందిన సంఘటన గురువారం రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ రమేష్‌కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. రామవరం టూ ఇంక్‌లైన్‌కు చెందిన ప్లంబర్‌గా పని చేస్తున్న తమ్మా నిరంజన్ (25) గురువారం తెల్లవారుజామున చుంచుపల్లి మండలం రామవరం, పెనగడప గ్రామాల మధ్య ఉన్న ఓ రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించేందుకు వెళ్లా గా.. విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు, స్నేహితులు పోలీసులకు సమాచారం అందించగా.. కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని చెప్పారు. తల్లి తమ్మా అరుణ తన కుమారుడితో పాటు హుస్సేన్, కిరణ్, ఆదర్శ్, శివలు వెళ్లారని ఫిర్యాదులో పేర్కొందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## క్లుప్తంగా...

### బకాయిలు చెల్లించండి



సాక్షి, హైదరాబాద్‌: ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్‌ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని కోరారు. ఆయన గురువారం సీఎంను కలిసి బకాయిలపై వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

### రిటైర్డ్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భట్టి విక్రమార్కను కలిసిన రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్‌: ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం కోరింది. సంఘం అధ్యక్షుడు జి.దామోదర్‌ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం ఉప ముఖ్యమంత్రిని కలిసింది. రిటైర్డ్‌ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్‌ పథకం ద్వారా కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. సేవలు అందకపోవడంతో వృద్ధాప్యంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో వెల్‌నెస్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.

## ధర లేక.. టమాటా పంట కాల్చివేత



**రెండెకరాల్లో 7500 కిలోల టమాటా పంట ధ్వంసం**

శివ్వంపేట(నర్సాపూర్‌): టమాటాకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఒక రైతు పంటను తగులబెట్టాడు. మండల పరిధి నవాబుపేట గ్రామానికి చెందిన రవిగౌడ్‌ నాలుగు ఎకరాల్లో టమాటా పంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పొలం నుంచి పంటను సేకరించి మార్కెట్‌కు తరలిస్తే.. ఒక్కొక్క బాక్స్‌కు రూ.50 మించి ధర రావడం లేదు. రవాణాకు ఒక్కో బాక్స్‌కు రూ.30 పోగా రూ.20 వస్తున్నాయని, కూలీల డబ్బులు సైతం చేతికి అందడం లేదని రైతు వాపోయాడు. దీంతో గురువారం రెండు ఎకరాల్లోని 7500 కిలోల టమాటా పంటను తొలగించి తగులబెట్టాడు. ఇదే గ్రామంలో 25 మంది రైతులు సుమారు 60 నుంచి 70 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వీరంతా తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది.

## రహదారి దెబ్బ తినకుండా..



నేలకొండపల్లి: పొలాలు దున్నే ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బ తింటుంటాయి. వాహనచోదకులు కూడా ఇబ్బంది పడుతుంటారు.. దీన్ని నివారించేందుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ రైతు, ట్రాక్టర్‌ యజమాని మరికంటి కిశోర్‌ వినూత్న ఆలోచన చేశారు. పొలాలకు వెళ్లేటప్పుడు కేజీవీల్స్‌ రోడ్డును తాకకుండా మరో ట్రాక్టర్‌కు జతచేసి నడిపిస్తున్నారు. ట్రాక్టర్‌ ముందు నడుస్తుంటే.. కేజీవీల్స్‌ ఉన్న ట్రాక్టర్‌ రివర్స్‌లో వెళ్తుంటుంది. కాగా, ఇది చూసిన వారు రైతు కిశోర్‌ను అభినందిస్తున్నారు.

# దాటవేత.. ఎగవేత!

**సూపర్‌ సిక్స్‌ సహా హామీలకు బాబు మంగళం • 'తల్లికి వందనం' ఎగనామం..**

సాక్షి, అమరావతి: అన్ని పథకాలపై దాటవేత ధోరణి.. చర్చల పేరుతో కాలక్షేపం.. ఎగవేతకు దారుల అన్వేషణ..! కొత్త సంవత్సరంలోనూ క్యాబినెట్‌ సాక్షిగా సూపర్‌ సిక్స్‌ హామీలకు కూటమి సర్కారు ఎగనామం పెట్టింది. తల్లికి వందనం నుంచి అన్నదాతా సుఖీభవ దాకా.. ఆడబిడ్డ నిధి నుంచి ఉద్యోగులకు పీఆర్‌సీ, ఐఆర్‌.. నిరుద్యోగులకు భృతి వరకు ఇదే తీరు!! కొత్త ఏడాది కోటి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్న తల్లులు, రైతన్నలు, ఉద్యోగులు, నిరుద్యోగులకు మళ్లీ నిరాశ మిగిలింది. ఎన్నికల ముందు సూపర్‌ సిక్స్‌.. సెవన్‌ అంటూ ఎడాపెడా హామీలిచ్చిన సీఎం చంద్రబాబు పీఠం ఎక్కిన తరువాత వాటిని ఎగ్గొట్టేందుకు ఆర్థిక పరిస్థితి, చర్చల పేరుతో కాలక్షేపం చేస్తున్నారు. సూపర్‌ సిక్స్‌ సహా ఇతర హామీలను అటకెక్కించి తొలి ఏడాది గడిపేశారు. కొత్త సంవత్సరంలోనూ నిర్దిష్టంగా ఫలానా తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో హామీల అమలుపై కచ్చితమైన నిర్ణయాలు తీసుకోకుండా చర్చల పేరుతో ఎగనామం పెట్టేందుకు ఎత్తుగడ వేయడం గమనార్హం. సీఎం చంద్రబాబు ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో 87.42 లక్షల మంది విద్యార్థులు ఒక్క ఏడాదే రూ.13,112 కోట్ల మేర నష్టపోయారు. 54 లక్షల మంది రైతన్నలు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందకపోవడంతో రూ.7,500 కోట్ల మేర నష్టపోయారు. కోటి మందికిపైగా యువత నిరుద్యోగ భృతి కోసం.. 'ఆడబిడ్డ నిధి' కోసం 1.80 కోట్ల మంది మహిళలు పడిగాపులు కాస్తుంటే నూతన ఏడాది నిర్వహించిన తొలి మంత్రివర్గ భేటీలో ఒక్క సానుకూల ప్రకటన కూడా చేయలేదు. వాటిని అమలు చేసే ఉద్దేశం లేకపోవడం వల్లే చర్చల పేరుతో ప్రభుత్వం సాగదీస్తోందని, ఎన్నికల హామీలను నమ్మి మోసపో



యామని ప్రజలు గ్రహిస్తున్నారు. ఇవాళ రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత అదే జగన్‌ అధికారంలో ఉండి ఉంటే ఈ సమయానికి ఏ పథకాల కింద, ఎంత లబ్ధి చేకూరేదో బేరీజు వేసుకుంటున్నారు.

**అమ్మ ఒడి ఆగిపోయి.. తల్లికి వందనం లేక!**

పేదరికం చదువులకు అడ్డు కాకూడదని, పేదింటి తలరాతలను మార్చే శక్తి విద్యకే ఉందని దృఢంగా నమ్మిన మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి'పథకాన్ని ప్రవేశపెట్టారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు పిల్లలను పాఠశాలలు, కాలేజీలకు పంపిన తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున క్రమం తప్పకుండా జమ చేశారు. ఒక్క అమ్మ ఒడి ద్వారానే రూ.26 వేల కోట్లకుపైగా తల్లులకు అందించి పిల్లల చదువులకు భరోసా కల్పించారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తామన్న హామీని చంద్రబాబు అటకెక్కించేశారు. తొలి ఏడాది దీన్ని అమలు చేయకుండా పిల్లల చదువులను నీరుగార్చిన కూటమి సర్కారు అసలు పూర్తిగా పథకాన్నే ఎత్తివేసే దిశగా వ్యూహం రచిస్తోంది.

**అన్నదాతలకూ ఎగనామమే**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండు వ్యవసాయ సీజన్లు గడుస్తున్నా అందించలేదు. రైతు భరోసా పేరును అన్నదాతా సుఖీభవగా మార్చడం మినహా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అమలు చేయలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌ కింద ఇప్పటికే రైతులకు రెండు విడతలు ఆర్థిక సాయం అందించడం గమనార్హం. చంద్రబాబు సర్కారు ఆ రెండు విడతలూ అన్నదాతలకు సాయం అందించకుండా ఎగనామం పెట్టింది. కేంద్రం తదుపరి ఇచ్చే వాటా ఆధారంగా రాష్ట్రం ఇవ్వాల్సిన వాటాపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో గత రెండు విడతలూ కూటమి సర్కారు రైతు భరోసా సాయాన్ని అందించకపోవడంతో 53.58 లక్షల మంది రైతులు రూ.7,500 కోట్ల మేర నష్ట పోయారు.

**ఉద్యోగులకు మొండిచెయ్యి**

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుపై దృష్టి సారించలేదు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, కూటమి ప్రభుత్వం రాగానే వెంటనే ఐఆర్‌ ప్రకటిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చింది. సీపీఎస్‌/జీపీఎస్‌ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని వాగ్దానం చేసింది. ఇంతవరకూ ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం కొత్త పీఆర్సీ ఏర్పాటుతో పాటు కమిషనర్‌ను నియమించింది. అయితే చంద్రబాబు సర్కారు కమిషనర్‌తో రాజీనామా చేయించింది. ఇక పీఆర్సీ కమిషన్‌ గురించి అసలు పట్టించుకోవడమే లేదు. ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదు. ఇందుకు భిన్నంగా వైఎస్‌ జగన్‌ తొలి కేబినెట్‌ సమావేశంలోనే ఉద్యోగులకు 2019 జూలై 1 నుంచి 27 శాతం ఐఆర్‌ ఇచ్చారు. ఇప్పుడు ఏడు నెలలైనా ఐఆర్‌ గురించి చంద్రబాబు సర్కారు అసలు పట్టించుకోవడమే లేదు.

## యాదగిరీశుడికి మదర్‌ డెయిరీ నుంచే నెయ్యి

- విజయ నెయ్యి ఇప్పుడే వద్దని దేవాదాయ శాఖ ఆదేశం
- మదర్‌ డెయిరీతో మార్చి 31వరకు ఉన్న ఒప్పందం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి మరికొంత కాలం మదర్‌ డెయిరీ నుంచే నెయ్యిని కొనుగోలు చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి విజయ డెయిరీ నెయ్యిని వినియోగించాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మదర్‌ డెయిరీ నెయ్యినే వాడనున్నారు. మదర్‌ డెయిరీ టెండర్‌ ఒప్పందం మార్చి 31వ తేదీ వరకు ఉన్న నేపథ్యంలో ఆలయానికి ఆ సంస్థ నెయ్యినే కొనుగోలు చేసేందుకు దేవాదాయ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పుడే విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని దేవాదాయశాఖ అధికారులు భావిస్తునట్లు సమాచారం.

**ఏడాదికి రూ.18 కోట్ల విలువైన నెయ్యి..**

యాదగిరీశుడి క్షేత్రంలో లడ్డూతో పాటు ఇతర ప్రసాదాల్లో వాడే మదర్‌ డెయిరీ నెయ్యి కోసం దేవస్థానం ఏటా సుమారు రూ.18 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నెలా 25 వేల నుంచి 30 వేల కిలోల వరకు ఆలయానికి మదర్‌ డెయిరీ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తోంది. కాగా గతేడాది నిర్వహించిన నెయ్యి సరఫరా టెండర్లలో మదర్‌ డెయిరీతో పాటు విజయ డెయిరీ సంస్థ కూడా పాల్గొంది. ఇందులో ఎల్‌-1గా నిలిచిన మదర్‌ డెయిరీతో నెయ్యి కొనుగోలుకు ఆలయం ఒప్పందం చేసుకుంది.

## గ్రామాల్లో పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం

- 1.66 కోట్ల మందికి పరీక్షలు
- 22.94 లక్షల మందికి బీపీ ... 11.9 లక్షల మందికి షుగర్‌
- ఎన్‌సీడీపై ప్రభుత్వ సర్వే ఫలితాలపై ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో కూడా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. జీవన విధానంతో పాటు ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, ఒత్తిళ్ల నేపథ్యంలో గ్రామాల్లో కూడా నాన్‌ కమ్యూనికేబుల్‌ డిసీజెస్‌ (ఎన్‌సీడీ) బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో ఎన్‌సీడీ వ్యాధులపై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వే వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ ఆర్‌.వి.కర్ణన్‌, ఇతర అధికారులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివరించారు. 30 సంవత్సరాల వయస్సు దాటిన 1.66 కోట్ల మందికి పరీక్షలు జరపగా, 22.94 లక్షల మందికి రక్తపోటు, 11.9 లక్షల మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. కోఠిలోని టీజీఎంఎస్‌ఐడీసీ కార్యాలయంలో గురువారం మంత్రి రాజనర్సింహతో జరిగిన ఈ సమావేశంలో సంక్షేమ శాఖ కమిషనర్‌ ఆర్‌వీ కర్ణన్‌, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ హేమంత్‌, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్‌ అజయ్‌ కుమార్‌, డీహెచ్‌ రవీందర్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లీనిక్‌లకు బీపీ, షుగర్‌ వంటి నాన్‌ కమ్యూనికేబుల్‌ వ్యాధులతో బాధపడుతున్న రోగులను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందుతున్న వైద్య సేవలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పేషెంట్ల జాబితాను తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని సూచించారు. బీపీ, షుగర్‌ పేషెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను కొనసాగించాలని ఆయన సూచించారు.

**జిల్లా వార్తలు**

### జనవరి 5న యోగా పోటీలు

కొణిజర్ల: యోగా ప్రచార సమితి ఆధ్వర్యాన వచ్చే నెల 5వ తేదీన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు రామన అచ్యుత్‌ ఓ ప్రకటనలో తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనడానికి 8నుంచి 60ఏళ్ల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 1వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 81064 68801 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

**టీఎస్‌ యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి**



మాట్లాడుతున్న చావా రవి

బోనకల్‌: ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చి హామీలను వెంటనే అమలు చేయాలని టీఎస్‌ యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్‌ చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉంటుందని అన్నారు. కొత్త పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినిమమ్‌ టైంస్కేల్‌ అమలు చేయాలని, ఉద్యోగాలను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు షేక్‌ రంజాన్‌, కార్యదర్శి రామకృష్ణ, నాయకులు నెల్లూరి వీరబాబు, సద్దాబాబు, గోపాల్‌రావు, కమలాకర్‌ పాల్గొన్నారు.

# డిజైన్‌ లోపంతోనే పగుళ్లు

**సత్తుపల్లి సీహెచ్‌పీ బంకర్‌పై నిపుణుల నివేదిక**

- నిర్మాణ సమయాన పర్యవేక్షణ లోపమే కారణమంటున్న కార్మికులు
- రైలు మార్గంలో బొగ్గు రవాణా కోసం రూ.398 కోట్లతో నిర్మాణం
- పగుళ్లతో ప్రస్తుతం అరకొరగానే రవాణా



సత్తుపల్లిలోని జేవీఆర్‌ సీహెచ్‌పీ



బంకర్‌లో ఏర్పడిన పగుళ్లు

సింగరేణి(కొత్తగూడెం): రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా సింగరేణిలో కొందరు అధికారుల తీరు ఉంటోంది. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి సత్తుపల్లిలోని జేవీఆర్‌, కిష్టారం ఓసీల నుండి రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా కోసం రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన సీహెచ్‌పీ(కోల్‌ హ్యాండ్లింగ్‌ ప్లాంట్‌) బంకర్లలో పగుళ్లు రావడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ బంకర్లు నిర్మించి రెండేళ్లు కావొస్తుండగా పగుళ్లు వచ్చినట్లు మూడు నెలల క్రితం గుర్తించారు. ఈ విషయమై ఢిల్లీ ఐఐటీ నిపుణుల(థర్డ్‌ పార్టీ)తో విచారణ జరిపించగా డిజైన్‌ లోపమే కారణమని ఇటీవల నివేదిక అందించినట్లు తెలిసింది. దీంతో నిర్మాణం సమయాన అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వస్తున్నాయి.

**రూ.398 కోట్లతో నిర్మాణం**

సింగరేణి పరిధిలోని కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో కీలకంగా ఉంటోంది. దీంతో ఈ ఏరియా పరిధి సత్తుపల్లిలోని జేవీఆర్‌, కిష్టారంల్లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవుతుండగా, రవాణా కోసం సీహెచ్‌పీ నిర్మించారు. ఇందులో మూడు బంకర్లు ఉండగా ఒకటి పూర్తిగా, ఇంకొకటి పాక్షికంగా పగుళ్లు బారాయి. ఈ కారణంగా ఇక్కడి నుంచి రోజుకు 10 రైల్వే రేక్‌ల ద్వారా బొగ్గు రవాణా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 5, 6కు మించి రేక్‌లు వెళ్లడం లేదు.

**రెండేళ్లలోనే పగుళ్లు..**

సింగరేణి సంస్థకు గుండెకాయలా నిలుస్తున్న కొత్తగూడెం ఏరియాలో నెలకు దాదాపు 13 లక్షల బొగ్గు టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. గడిచిన ఎనిమిది నెలల్లో ఎక్కడా లేని విధంగా 87,02,014 టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైంది. అయితే, సీహెచ్‌పీలోని బంకర్లలో పగుళ్లు రావడంతో ఉత్పత్తికి అనుగుణంగా రవాణా జరగడం లేదని తెలుస్తోంది. కాగా, బొగ్గు రవాణా కోసం రూ.398 కోట్ల వ్యయంతో సీహెచ్‌పీ నిర్మాణ బాధ్యతలను సమంత కంపెనీకి కట్టబెట్టారు. అయితే, డిజైన్‌ కానీ నిర్మాణ సమయంలో పనులు ఎలా జరుగుతున్నాయనే అంశాన్ని కానీ ఆనాటి ఏరియా అధికారులు కానీ సివిల్‌, క్వాలిటీ, విజిలెన్స్‌ అధికారులు కానీ పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం బంకర్లలో పగుళ్లు రావడానికి డిజైన్‌ లోపమే కారణమని నిపుణుల కమిటీ నివేదికతో వెల్లడైనట్లు సమాచారం. అంతేకాక బంకర్‌ నిర్మాణంలో నాణ్యమైన సామగ్రి వాడలేదనే అంశాన్ని కూడా నివేదికలో పొందుపర్చారని ఓ అధికారి తెలిపారు.

**నిర్వహణ ఎవరి బాధ్యత?**

ఏరియాలోని జేవీఆర్‌, కిష్టారం ఓసీల్లో ఉత్పత్తి అయ్యే బొగ్గును రైలు మార్గం ద్వారా రవాణా చేసేందుకు 8వేల టన్నుల సామర్థ్యం కలిగిన మూడు బంకర్లను నిర్మిస్తే వాటిలో ఒకటి పూర్తిగా, ఇంకొకటి పాక్షికంగా పగుళ్లు బారింది. కాగా, నిర్మాణ సంస్థకే కొన్నేళ్ల పాటు నిర్వహణ బాధ్యత ఉంటుందని తెలుస్తోంది. అయితే, అగ్రిమెంట్‌లో ఏముందో తెలియదు కానీ బంకర్లకు పగుళ్లు వచ్చాయని తెలిసినా కంపెనీ బాధ్యులు ఇటువైపు దృష్టి సారించడం లేదని సమాచారం. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టడానికి మరో రూ.3.50కోట్ల మేర వ్యయమవుతుందని తెలుస్తుండగా, అధికారులు టెండర్లు కూడా పిలిచారు. ఇంతవరకు బాగానే ఉన్నా నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆనాటి అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో తేలాల్సి ఉంది.

**రవాణాకు అంతరాయం వాటిల్లకుండా...**

ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణాపై దృష్టి సారించాం. ఇందులో భాగంగా సీహెచ్‌పీలో బంకర్ల మరమ్మతుకు టెండర్లు పిలిచాం. ఇందుకు వ్యయాన్ని నిర్మాణం చేపట్టిన కంపెనీతో చెల్లింపులు జరిపేలా ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు.

– శాలేం రాజు, కొత్తగూడెం ఏరియా జనరల్‌ మేనేజర్‌

## జాతీయస్థాయి అథ్లెటిక్‌ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

ఖమ్మంసహకారనగర్‌: ఈనెల 7, 8, 9 తేదీల్లో జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి అండర్‌-19 అథ్లెటిక్‌ పోటీలకు ఖమ్మంలోని నయాబజార్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థి జి.వెంకట సాయి ఎంపికయ్యాడు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన 800 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్‌ కె.ఎస్‌.రామారావు తెలిపారు. పోటీలకు వెళ్లేందుకు కళాశాల సిబ్బంది రూ.4 వేలు ఆర్థిక సాయం అందించడంతోపాటు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ జి.వెంకటేశ్వర్లు, గణిత అధ్యాపకుడు జి.అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

## బాలాజీ ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. పండితులు గిరిధరాచార్యుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వందల సంఖ్యలో హాజరైన భక్తులు హోమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అర్చకులు ప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ పనులకు అందని బిల్లులు

- వరద తాకిడితో దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జిలు
- రూ.కోట్ల విలువైన బిల్లుల కోసం ఎదురుచూపులు
- ఆర్‌అండ్‌బీలో ముందుకు సాగని పనులు



గుంతలు పడిన రహదారిపై వేసిన ప్యాచ్‌



వరదలతో దెబ్బతిన్న వంతెన (ఫైల్‌)

ఖమ్మంఅర్బన్‌: చేసిన పనులకు బిల్లులు రాక, చేయాల్సిన పనులకు నిధులు లేక ఆర్‌అండ్‌బీ పరిధిలో రహదారుల తీరు గందరగోళంగా మారింది. వరదల ప్రభావంతో నాలుగు నెలల కిందట ఖమ్మం జిల్లాలో చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఆ తర్వాత శాశ్వత మరమ్మతుల కోసం ఇంజనీరింగ్‌ అధికారులు పంపించిన ప్రతిపాదనలకు నెలలు దాటుతున్నా మోక్షం లభించడం లేదు. ఫలితంగా చేసిన పనుల బిల్లుల కోసం, చేయాల్సిన పనుల నిధుల మంజూరు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

**బిల్లులు రూ.25 కోట్లకు పైగానే**

వరదల కంటే ముందే జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఏటా చేపట్టే మెయింటెనెన్స్‌లో భాగంగా సుమారు రూ.25 కోట్ల విలువైన పనులు చేయించారు. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లు గత మార్చి నుంచి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు వరదలతో దెబ్బతిన్న రహదారుల్లో అప్పటికప్పుడు మరమ్మతులు చేస్తేనే రాకపోకలు సాగించే అవకాశం ఉండటంతో అధికారులు స్థానిక కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి సుమారు రూ.30 కోట్ల విలువైన పనులు చేయించారు. ఇప్పటివరకు ఆ బిల్లులు కూడా అందలేదు. ఆపై వరదలతో దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, కల్వర్టుల శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.250 కోట్లకు పైగానే అవసరం ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే మోక్షం లభించడం లేదు. దీంతో అటు కాంట్రాక్టర్లు.. ఇటు అధికారులు ఏం చేయాలో తోచక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడమే కాక శాశ్వత మరమ్మతుల ప్రతిపాదనలకు అనుమతి జారీ చేస్తే వచ్చే వర్షాకాలంలో సమస్యలు ఎదురు కావని భావిస్తున్నారు.

# పాలకవర్గంలో స్థానంపై ఆసక్తి

**పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీకి 30 దరఖాస్తులు**



పాల్వంచ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్‌: ఉమ్మడి జిల్లాలో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం తర్వాత అంతటి భక్తుల రద్దీ, ఆదాయం కలిగిన పాల్వంచలోని పెద్దమ్మ తల్లి ఆలయ పాలక మండలిలో స్థానం కోసం 30 మంది దరఖాస్తు చేసుకున్నారు. పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) దేవస్థానం ఉండగా, గత పాలకవర్గం పదవీకాలం ఈ ఏడాది మార్చి 24న ముగిసింది. అంతకుముందే నూతన పాలక మండలి నియమాకం కోసం ఎండోమెంట్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఫిబ్రవరిలో నోటిఫికేషన్‌ జారీ చేయగా పోటాపోటీగా 52మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఆ నోటిఫికేషన్‌ పక్కన పెట్టిన ఉన్నతాధికారులు గతనెల 22న మరోమారు నోటిఫికేషన్‌ జారీ చేశారు. నోటిఫికేషన్‌ వెలువడిన నాటి నుంచి 20రోజుల గడువు ఇవ్వగా 30మంది దరఖాస్తులు సమర్పించారు. తొలి విడతతో పోలిస్తే ఈసారి దరఖాస్తుల తగ్గడం గమనార్హం. కాగా, పాల్వంచ, కొత్తగూడెం పట్టణం, మండల పరిధిలోని అధికార పార్టీ శ్రేణులు ఇందులో ఉన్నట్లు తెలిసింది. అధికార పార్టీలోని నాయకుల అనుచరులు పాలకవర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తుండగా ఆయా నాయకులు ఆ ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు సమాచారం. ఈ విషయమై దేవాదాయ శాఖ ఖమ్మం అసిస్టెంట్‌ కమిషనర్‌ వీరస్వామి మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆలయ పాలక మండలిలో స్థానం కోసం 30దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఆతర్వాత ఉన్నతాధికారుల సూచన మేరకు నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించారు.